సాక్షి తిరుపతి

శుక్రవారం । 16 । మే । 2025



పూజలు చేస్తున్న అర్చకులు

న్యూస్‌రీల్

'తల్లికి వందనం'.. తల్లడిల్లేను తల్లులు

- కలెక్టరేట్‌లో 'తల్లికి వందనం' బోర్డుల ఏర్పాటు



కలెక్టరేట్‌లోని సమగ్రశిక్ష అభియాన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన తల్లికి వందనం బోర్డులు

తిరుపతి అర్బన్ : తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో తల్లికి వందనం బోర్డులను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లోని ఏ బ్లాక్ కార్యాలయంలోని అయిదో అంతస్తులోని సమగ్ర శిక్షా అభియాన్ (విద్యాశాఖ)కార్యాలయం వరండాలో తల్లికి వందనం బోర్డులను ఏర్పాటు చేశారు. అందులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ చిత్రాలతో బోర్డులు ఉన్నాయి. అయితే కలెక్టరేట్‌కు వివిధ సమస్యలపై నిత్యం ఎంతో మంది ప్రజలు వచ్చిపోతుంటారు. ఈ క్రమంలో వారంతా తల్లికి వందనం బోర్డులను చూసి ఏడాది గడుస్తున్నా పథకం అమలు కాలేదని 'తల్లడిల్లిపోతున్నారు. అమలుకాని పథకాలకు ఈ ప్రచార ఆర్భాటం దేనికో అని తల్లులు నిట్టూరుస్తున్నారు.


ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 705 గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథ్స్–1బి, 2బి, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల్లో పరీక్షను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 64 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రథమ సంవత్సర పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 15,510 మందికి 639 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సర పరీక్షకు 22 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 1,555 మందికి 66 మంది హాజరు కాలేదని ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

నేటితో ముగియనున్న డిగ్రీ పరీక్షలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో పది రోజులుగా జరుగుతున్న డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారంతో ముగియనున్నాయి. హాల్‌టికెట్ల గందరగోళం, పరీక్షా షెడ్యూల్ సందిగ్ధంతో ఈ ఏడాది డిగ్రీ పరీక్షలు అధికారులు నిర్వహించడంతో విద్యార్థులు అసహనానికి గురయ్యారు. గురువారంతోనే డిగ్రీ పరీక్షలు పూర్తి కావాల్సి ఉండగా ఈనెల ఒకటో తేదీన నిర్వహించిన ఫైనాన్షియల్ అకౌంటింగ్ సప్లిమెంటరీ పరీక్షకు విద్యార్థులు పూర్తి స్థాయిలో హాజరు కాలేకపోవడంతో శుక్రవారం నిర్వహిస్తుండటం గమనార్హం. ఎస్వీయూ అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఈ ఏడాది డిగ్రీ విద్యార్థులు పరీక్షలు అంతంత మాత్రంగానే రాసినట్లు విద్యార్థులు చెబుతున్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేథోగురుదక్షిణామూర్తికి గురువారం గురుపేదిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా కలశ స్థాపన చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ చేశారు. తరువాత స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేక పూజలు జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, విజయకుమార్ నాయుడు, ప్రధానార్చకులు కరుణాకరన్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి

అడ్డొస్తున్నాడనే దాడులు

ఆక్రమణలకు అడ్డొస్తున్నాడని ఏకంగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అనిల్‌కుమార్‌పై మందీ మార్బలంతో టీడీపీ నేతలు దాడులకు తెగబడటం విస్మయానికి గురిచేస్తోంది. దాడిచేసి మళ్లీ వారిపైనే కేసులు నమోదు చేయించడం కూటమి ప్రభుత్వం కక్ష సాధింపునకు ఈ ఘటనే ప్రత్యక్ష నిదర్శనం.

వందేళ్ల నాటి శ్మశానాన్ని ఆక్రమించుకున్న టీడీపీ నేతలు

- పదేళ్లుగా ఆక్రమణలను అడ్డుకుంటున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అనిల్‌కుమార్
- ఆ కక్షతోనే అనిల్‌పై టీడీపీ నేత వెంకటరత్నం అనుచరులతో దాడి
- రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది
- టీడీపీ గూండాల నుంచి రక్షణ కల్పించాలంటున్న హరిజనవాడ గ్రామస్తులు
- ఇరువర్గీయులపై కేసు నమోదు చేసిన అలిపిరి పోలీసులు



తిమ్మినాయుడుపాలెం హరిజనవాడలోని శ్మశాన స్థలంలో అక్రమ నిర్మాణాల కోసం రెండు రోజులుగా జేసీబీతో చదును చేస్తున్న టీడీపీ నేతలు



కార్పొరేటర్ అనిల్ తల్లి కుప్పమ్మను ఓదార్చి భరోసా ఇస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి 50వ డివిజన్ తిమ్మినాయుడుపాళెం హరిజనవాడలో టీడీపీ నాయకులు చేస్తున్న కబ్జాలను ప్రశ్నిస్తున్నందుకే కార్పొరేటర్ బోకం అనిల్ కుమార్‌పై గురువారం దాడులకు తెగబడ్డారు. తిమ్మినాయుడుపాళెం హరిజనవాడలో గత టీడీపీ ప్రభుత్వంలో స్థానిక టీడీపీ నేత కాయం వెంకటరత్నం తన అనుచరులతో పాటు గ్రామస్తులు కొంత మంది తిమ్మినాయుడుపాళెంలోని సర్వే నంబర్ 199లో కాలువ పొరంబోకు స్థలం 1.45 ఎకరాలు గత వందేళ్లుగా తాతల ముత్తాతల నాటి శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకుని రేకుల ఇల్లు నిర్మించుకున్నారు. దీనిపై అప్పటి నుంచి జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు అనిల్ ఫిర్యాదులు చేస్తూ శ్మశాన స్థల ఆక్రమణను అడ్డుకుంటూ వస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో శ్మశానం ఆక్రమణకు గురికాకుండా అడ్డుకున్నారు.

50 మందికి పైగా అనుచరులతో దాడి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరిగి శ్మశాన స్థలాన్ని పూర్తిగా ఆక్రమించుకుని నిర్మాణాలను రెండు రోజులుగా చేపట్టారు. దీనిపై ఎక్కడ మళ్లీ అధికారులకు ఫిర్యాదు చేస్తాడోననే భయంతో కార్పొరేటర్ అనిల్ ఇంటి నుంచి గ్రామంలోని అమ్మవారి ఆలయానికి వెళుతుండగా కాయం వెంకటరత్నం 50 మందికి పైగా తన అనుచరులతో వచ్చి దాడి చేశాడని కార్పొరేటర్ బోకం అనిల్‌కుమార్, అతని తల్లి కుప్పమ్మ, సోదరి కాటమ్మలతో పాటు గ్రామస్తులు తెలిపారు. ఇంత దౌర్జన్యమేమిటని ప్రశ్నించినందుకు తమపై కూడా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని అనిల్ తల్లి కుప్పమ్మ, సోదరి కాటమ్మ బోరున విలపిస్తూ చెప్పారు. ఇంకొకసారి తమకు అడ్డు వస్తే చంపేస్తామంటూ బెదిరించారని అనిల్ కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు చెబుతున్నారు. అధికార గర్వంతో ఇంతటి రౌడీయిజం మంచిది కాదని స్థానికులు చెబుతున్నా పట్టించుకోకుండా టీడీపీ నాయకులు ఇష్టమొచ్చినట్లు అనిల్‌ను కొట్టారని స్థానికులు తెలిపారు. వెంటనే ఆసుపత్రికి తీసుకుపోండి లేకుంటే ఇక్కడే చంపేస్తామని బెదిరించినట్లు చెప్పారు. దాంతో ఒక్క సారిగా హరిజనవాడ గ్రామస్తులంతా భయాందోళనకు గురయ్యారు. తీవ్రంగా గాయపడిన కార్పొరేటర్ అనిల్‌తో పాటు సోదరి కాటమ్మను రుయా ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డుకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

రెడ్‌బుక్ పాలనతో అరాచకం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కాకుండా లోకేష్ రాసుకున్న రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డితో పాటు తిరుపతి నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులకు ఓట్లు వేసి గెలిపించినందుకు సంక్షేమాన్ని పక్కనపెట్టి కక్ష పూరిత రాజకీయాలు చేస్తున్నారని మండి పడుతున్నారు. ఇలాగే కూటమి నాయకులు రెచ్చిపోతే స్వచ్ఛందంగా తామే రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడుతామని నగర ప్రజలు చెబుతున్నారు.

టీడీపీ నేతల దౌర్జన్యం.. దెబ్బలు తిన్నవారిపైనే కేసులు



తీవ్ర గాయాలతో రుయాలో చికిత్స పొందుతున్న అనిల్ సోదరి కాటమ్మ

తిరుపతి 50వ డివిజన్ హరిజన వాడలో జరిగిన దాడుల నేపథ్యంలో కార్పొరేటర్ అనిల్‌పై తీవ్రంగా దాడి చేసిన టీడీపీ నాయకులే ముందుగా రుయా ఆసుపత్రికి వచ్చి తమను అనిల్ బైక్‌తో గుద్దేశాడని, దాంతో కాలుకు తీవ్రంగా గాయం అయిందంటూ టీడీపీ నాయకుడు వెంకటరత్నం ఆసుపత్రిలో చేరాడు. ఇదంతా అనిల్‌పై చేసిన దాడి నుంచి తప్పించుకునేందుకు ఆడుతున్న నాటకాలని స్థానిక గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఇరు వర్గాలు దాడు చేసుకుని గాయాలపాలైనట్లుగా తూతూమంత్రంగా కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. అలిపిరి పోలీసులు మాత్రం ఇరువురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని చెబుతున్నారు. కానీ తనకు చెప్పకుండా బయటకు ఎక్కడికీ వెళ్లకూడదని టీడీపీ నాయకుడు వెంకటరత్నంను అలిపిరి సీఐ రాంకిషోర్ హెచ్చరించారు.



తీవ్ర గాయాలతో రుయాలో చికిత్స పొందుతున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్

సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న స్కిల్ హబ్ సెంటర్‌లో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి తెలిపారు. 320 గంటల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సుకు 10వ తరగతి, ఆపై విద్యార్హత కలిగి, 15 నుంచి 45 ఏళ్లలోపున్న వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణానంతరం అర్హత ఉన్న వారికి ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్, బ్యాంకు పాస్ బుక్ మొదటి పేజీ, బయోడేటా, 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 81435 76866 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ఏపీఈసెట్‌లోనూ బాలికలదే పైచేయి

– 93.52 శాతం ఉత్తీర్ణత

తిరుపతి ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ డిప్లొమో, బీఎస్సీ (మ్యాథ్స్) విద్యార్హతతో ద్వితీయ సంవత్సరం ఇంజినీరింగ్, ఫార్మసీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 6వ తేదీ జేఎన్‌టీయూఏ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఏపీఈసెట్‌ను నిర్వహించింది. ఈ ఫలితాల్లో తిరుపతి జిల్లా నుంచి 93.52 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఏపీఈసెట్‌కు జిల్లా నుంచి బాలురు 1,364 మంది, బాలికలు 530 మంది, మొత్తం 1,894 మంది దరఖాస్తు చేశారు. వీరిలో బాలురు 1,321 మంది, బాలికలు 516 మంది, మొత్తం 1,837 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాల్లో బాలురు 1,217 (92.13 శాతం), బాలికలు 501 (97.09శాతం) ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 1,718 (93.52 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. వీరు ద్వితీయ సంవత్సరం ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందనున్నారు.

అభివృద్ధికి ఆర్థిక సంఘం నిధులే ఆధారం



స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమైన 16వ ఆర్థిక సంఘం సభ్యులు

- జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలి
- 16వ ఆర్థిక సంఘం సభ్యులకు వినతి

తిరుపతి రూరల్ : గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆర్థిక సంఘం నిధులే ఆధారమైనందున పంచాయతీల్లో ప్రస్తుత జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం నిధులు కేటాయించాలని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు 16వ ఆర్థిక సంఘం సభ్యులకు విన్నవించారు. తిరుపతి రూరల్ మండలం తవణపల్లి రోడ్డులోని తాజ్ హోటల్‌లో గురువారం గ్రామీణ , పట్టణాల్లో ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో 16వ ఆర్థిక సంఘం సభ్యులు సౌమ్య కంటి ఘోష్, ఆర్థిక సంఘం జాయింట్ సెక్రటరీ ఎస్.గౌతమ్ అల్లాడ సమీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థల మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పారిశుద్ధ్యం, రోడ్లు , తాగు నీరు, డ్రైనేజీ మొదలగు అంశాలపై ఆర్థిక సంఘం సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. నిధులు పక్కదారి పట్టకుండా ప్రతి గ్రామంలో ఖర్చుచేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలని వారు ప్రజా ప్రతినిధులకు సూచించారు. అనంతరం మౌలిక సదు పాయాల కల్పనకు సరిపడా నిధులను కేంద్రం నుంచి విడుదల చేయించాలని ఆర్థిక సంఘం సభ్యులకు వివరించారు. టైడ్ , అన్‌టైడ్ నిధులు వేరుగా కాకుండా ఒకే మొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ అండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పి. సంపత్ కుమార్, పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ అడిషనల్ కమిషనర్ ఎం. సుధాకర్‌రావు, కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, డిప్యూటీ సీఈవో జుబేదా, డీపీఓ సుశీలాదేవి, శ్రీసిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, ఆర్థిక సంఘం విభాగం అధికారులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్‌లు, మేయర్లు, జిల్లా పరిషత్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

తిరుపతి ఐఐటీకి మహర్దశ

- ఫేజ్–బీ నిధులు రూ.2,313 కోట్లతో తిరుపతి ఐఐటీకి దీటైన వసతులు
- నూతన ఆవిష్కరణలకు కేంద్ర బిందువు కానున్న తిరుపతి ఐఐటీ
- 12 వేల మంది విద్యార్థులతో క్యాంపస్ మాస్టర్ ప్లాన్
- ఐజర్‌తో కలిసి మరిన్ని సైన్స్ పరిశోధనలు
- తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ

ఏర్పేడు (రేణిగుంట) : తిరుపతి ఐఐటీకి కేంద్రం ఫేజ్–బీ అభివృద్ధి పనుల కింద రూ.2,313 కోట్లు నిధులు కేటాయించడంతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన క్యాంపస్ రూపకల్పన చేస్తామని ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ స్పష్టం చేశారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లోని పరిపాలన భవనంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం దేశంలోని ఐదు ఐఐటీలైన తిరుపతి ఐఐటీ, కేరళ రాష్ట్రం పాలక్కాడ్ ఐఐటీ, ఛత్తీస్‌ఘడ్‌లోని భిలాయ్ ఐఐటీ, జమ్మూ ఐఐటీ, కర్ణాటక రాష్ట్రం దార్వాడ్ ఐఐటీలకు 2025–26 నుంచి 2028–29 నాలుగేళ్లకు రూ.11,828.79 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగా తిరుపతి ఐఐటీకి రూ.2,313 కోట్లు కేటాయించిందని తెలిపారు. పదేళ్ల స్వల్పకాలిక ప్రస్థానంలో తిరుపతి ఐఐటీ ఎన్నో అద్భుత విజయాలను అందుకుందన్నారు. అతి తక్కువ కాలవ్యవధిలోనే ఫేజ్–ఏలో రూ.1,444 కోట్లు ఖర్చు చేసి 1,200 మంది విద్యార్థులకు సరిపడా పూర్తిస్థాయి క్యాంపస్‌ను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ప్రస్తుతం 1,600 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని, రానున్న ఐదేళ్లలో మరో 1,300 సీట్లు పెరగనున్నట్లు ఆయన వివరించారు. బీటెక్‌తోపాటు ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తిరుపతి ఐఐటీని 12 వేల మంది విద్యార్థులు అభ్యసించే స్థాయికి తీసుకెళ్లటమే ధ్యేయమన్నారు.

ఆవిష్కరణలకు 230 సంస్థలతో ఒప్పందాలు

శాస్త్ర, సాంకేతిక రంగాలలో నూతన ఆవిష్కరణలను తీసుకొచ్చే లక్ష్యంతో ఇప్పటికే 230 సంస్థలతో కలసి భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకుని విద్యార్థులకు సమృద్ధిగా అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. తాజాగా కియా మోటార్ ఇండియా కంపెనీతో అయిదేళ్ల కాలానికి రూ.35కోట్లతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఐఐటీ విద్యార్థులే కాకుండా బయట కళాశాలల విద్యార్థులను ఇన్నోవేషన్ హబ్‌లో భాగస్వామ్యమయ్యే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను తీసుకొస్తున్నారని, అందులో భాగంగా తిరుపతి, అనంతపురం, కాకినాడ, విజయవాడ, విశాఖపట్నంలో శాఖలను ఏర్పాటు చేసి కొత్త ఆవిష్కరణల రూపకల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తిరుపతిలో ఏర్పాటు కానున్న రతన్‌టాటా హబ్‌కు తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో 19 ఎకరాలు స్థలాన్ని కేటాయించి ఇక్కడే ఏర్పాటు చేసేందుకు తాము సంసిద్ధత వ్యక్తం చేస్తూ ఇటీవల కలెక్టర్‌తో చర్చలు జరిపామన్నారు. శ్రీకాళహస్తి దేవస్థానం పైకప్పు లీకేజీ మరమ్మతు పనులను డిజైన్ చేసి పూర్తి చేయించామన్నారు. డిఫెన్స్‌కు సంబంధించి 11 ప్రాజెక్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాజిక కార్యక్రమాలలో భాగంగా ఏర్పేడు మండలంలో ఐదు గ్రామాలను దత్తత తీసుకున్నామన్నారు. సమావేశంలో ఐఐటీ విభాగాల డీన్‌లు శశిధర్ గుమ్మా, అనిల్ కుమార్, మురళీ కృష్ణ పాల్గొన్నారు.

ఉచిత ఫుట్‌బాల్ వేసవి శిబిరం



విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్న కోచ్ లోకేష్

తిరుపతి సిటీ : స్థానిక ఇస్కాన్ టెంపుల్ సమీపంలోని టీటీడీ వినాయకనగర్ క్వార్టర్స్ గ్రౌండ్‌లో 8 నుంచి 18 ఏళ్ల లోపు వయస్సుగల బాల, బాలికలకు ఉచితంగా ఫుట్‌బాల్ శిక్షణ ఇస్తున్నట్లు కోచ్ లోకేష్ తెలిపారు. విద్యార్థులకు సెలవుల నేపథ్యంలో క్రీడల్లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6.30 వరకు ప్రతి రోజు ఉచిత శిక్షణ ఇస్తున్నామని ఆసక్తి గల విద్యార్థులు ఉచిత శిక్షణలో పాల్గొనవచ్చునన్నారు. ఈ శిబిరం వచ్చేనెల 3వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 99664 31378 నంబర్ నందు సంప్రదించవచ్చునని తెలిపారు.

క్లుప్తంగా

ఎన్టీఆర్ వర్సిటీ వీసీతో ఎస్వీ ప్రిన్సిపల్ భేటీ



వీసీతో సమావేశమైన ప్రిన్సిపల్ రవిప్రభు

తిరుపతి తుడా : ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ చంద్రశేఖర్‌తో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతికి విచ్చేసిన ఆయనను గురువారం ఓ అతిథి గృహంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి సందర్శనకు రావాల్సిందిగా ఆహ్వానించారు. జులైలో రుయా, వైద్య కళాశాలల్లో పర్యటిస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పినట్లు ప్రిన్సిపల్ రవిప్రభు తెలిపారు. కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారధి రెడ్డి, పీఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

గరుడ వారధిపై తాత్కాలికంగా రాకపోకలు నిషేధం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో నిర్మించిన గరుడ వారధిపై వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు నగరపాలక కమిషనర్ మౌర్య తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించి ప్రతి ఏటా పనుల తనిఖీల్లో భాగంగా స్పాన్ లోడ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ క్రమంలో శుక్రవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు రామానుజ సర్కిల్ నుంచి శ్రీనివాసం కాంప్లెక్స్ వరకు రాకపోకలను నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తుంచుకుని వాహనదారులు, ఆర్టీసీ అధికారులు, నగర ప్రజలు మున్సిపల్ అధికారు లు, ట్రాఫిక్ పోలీసులకు సహరించాలని కోరారు.

వ్యక్తిపై హత్యాయత్నం : అయిదుగురు అరెస్టు

కేవీబీపురం:ఒక వ్యక్తిపై అయిదుగురు కలిసి హత్యాయత్నానికి పాల్పడటంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి అరెస్టు చేసిన ఘటన కేవీబీపురం మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ సమాచారం మేరకు ఎంఎ రాజుల కండ్రిగ ఎస్సీ కాలనీలో గ్రామ కంఠం భూమి విషయంలో వచ్చిన తగాదా కారణంతో మునయ్య అనే వ్యక్తిపై అదే కాలనీకిచెందిన బోసు,గిరి, దొరైరాజు, సెల్వ, గోపి అయిదుగురు కలిసి మారణాయుధాలతో దాడి చేయడంతో గాయపడ్డారన్నారు. ఈ మేరకు బాధితుడు శ్రీకాళహస్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడికి పాల్పడ్డ అయిదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పీఎం సహాయ నిధికి రూ. కోటి విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న గుబ్బా చౌల్ట్రీ ట్రస్టీలు

తిరుపతి కల్చరల్ : తిరుమల గుబ్బా చౌల్ట్రీ ట్రస్టీ ఒంటేరు శ్రీనివాసులురెడ్డి ప్రధాన మంత్రి జాతీయ సహాయనిధికి గురువారం కోటి రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ విరాళం చెక్కును విజయవాడలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి చేతులు మీదుగా అందించారు. కార్యక్రమంలో గుబ్బా చౌల్ట్రీ ట్రస్టీలు చెక్కా నాగకుమార్, ఆర్.శ్రీరి, దారా సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

పేరుకే తిరుపతి జిల్లా..

పాలనంతా చిత్తూరే!

- పరిష్కారం కాని విభజన సమస్యలు
- ఎస్సీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్‌లు చిత్తూరుకే పరిమితం
- మూడేళ్లు దాటిన జిల్లా పునర్విభజన
- ఖాళీగా కలెక్టరేట్‌లో కార్పొరేషన్ చాంబర్లు
- కూటమి సర్కార్‌లో పట్టించుకోని కార్పొరేషన్ల విభజన

తిరుపతి అర్బన్ : పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పరిపాలన సౌలభ్యం కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లాల పునర్విభజన 2022 ఏప్రిల్ 4న చేపట్టారు. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా నుంచి కొన్ని మండలాలు, నెల్లూరు జిల్లా నుంచి కొన్ని మండలాలను విభజించి 34 మండలాలతో కొత్తగా తిరుపతి జిల్లా ఏర్పాటు చేశారు. కొత్త జిల్లాలు ఏర్పాటై మూడేళ్లు పూర్తయింది. ఇప్పటికీ అనేక కార్యాలయాలు చిత్తూరు కేంద్రంగానే నడిపిస్తున్నారు. పలు కార్యాలయాలకు కలెక్టరేట్‌లో చాంబర్లు కేటాయింపు చేశారు. కానీ ఉద్యోగులను కేటాయించలేదు. దీంతో పలు కార్యాలయాల చాంబర్లకు తాళాలే దర్శనమిస్తున్నాయి. తిరుపతి జిల్లా ఏర్పాటు చేసినా ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు.



కలెక్టరేట్‌లో తాళం వేసి ఉన్న గురుకుల డీసీవో కార్యాలయం



కలెక్టరేట్‌లో తాళం వేసి ఉన్న ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

చిత్తూరు కేంద్రంగా నడుస్తున్న కార్యాలయాలు

ఎస్సీ కార్పొరేషన్ అధికారం ఈడీ చెన్నయ్య చేతుల్లో ఉంది. అయితే ఆయన చిత్తూరు ప్రధాన కార్యాలయంలోనే ఉంటున్నారు. తిరుపతి జిల్లాకు కలెక్టరేట్‌లో ఓ చాంబర్‌ను అయితే కేటాయింపు చేశారు. అయితే అక్కడ ఎవరూ ఉండడం లేదు. అలాగే ఇటీవల బీసీ కార్పొరేషన్ , మైనారిటీలకు సంబంధించి రాయితీ రుణాలు మంజూరు చేశారు. వాటి కోసం దరఖాస్తు చేసుకునే వారు పలువురు కలెక్టరేట్‌కు వచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో చిత్తూరు వెళ్లక తప్పని పరిస్థితి దాపురిస్తోంది.

పలు విభాగాల పరిస్థితి అంతే..

ఎస్సీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల అధికారం చిత్తూరులో కొనసాగుతోంది. జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయానికి సంబంధించి రెండు జిల్లాల అధికారి చిత్తూరులోనే ఉంటున్నారు. కలెక్టరేట్‌లో నామమాత్రంగా ఓ చాంబర్‌ను కేటాయింపు చేశారు. గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి జిల్లా కోఆర్డినేటర్ అధికారి (డీసీవో) చిత్తూరులోనే ప్రధాన కార్యాలయం ఉంది. కలెక్టరేట్‌లో నామమాత్రంగా ఓ చాంబర్‌ను కేటాయింపు చేశారు. సివిల్ సప్లయ్‌కు సంబంధించి రేషన్ డీలర్లకు ఇటీవల పెద్ద మొత్తంలో తమకు రావాల్సిన కమిషన్లు జారీ ప్రక్రియ మొత్తం చిత్తూరులోని సివిల్ సప్లయ్ అధికారి వద్దకే తిరుగుతున్నారు. రెవెన్యూ విభాగంలోనూ బదిలీలు, పదోన్నతులు చిత్తూరు కలెక్టర్ తిరుపతి జిల్లాకు కేటాయింపులు చేయాల్సి ఉంది. ఆ తర్వాత తిరుపతి జిల్లా కలెక్టర్ వారి మండలాల వారీగా కేటాయింపులు చేస్తున్నారు. జిల్లా పరిషత్ అధికారం ఇప్పటికీ చిత్తూరు నుంచే కొనసాగుతోంది. తిరుపతి జిల్లాకు ఏ ఒక్క అధికారి లేరు. ఉన్నతాధికారులు అంతా చిత్తూరులోనే ఉంటున్నారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా వాటి జోలికి వెళ్లకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

అన్ని కార్యాలయాలు తిరుపతిలోనే పెట్టాలి



జిల్లాల పునర్విభజనకు మూడేళ్లు పూర్తయింది. అయినా చిత్తూరు నుంచి పలు విభాగాలను పూర్తిగా తిరుపతి జిల్లాకు మార్పు చేయకపోవడం సరికాదు. చిత్తూరు నుంచే అధికారులు రెండు జిల్లాలను పరిపాలించడం ద్వారా తిరుపతి జిల్లా వాసులకు అన్యాయం జరుగుతోంది. కూటమి నేతలు స్పందించి చర్యలు తీసుకోవాలి. – వెంకటేశ్, బీసీ నేత

ఎస్సీ కార్పొరేషన్ తిరుపతి నుంచే చేపట్టాలి



ఎస్సీ కార్పొరేషన్ కార్యకలాపాలు తిరుపతి నుంచే చేపట్టాలి. తిరుపతిలో కార్యాలయం ఉంటే పదే పదే వెళ్లడానికి అవకాశం ఉంటుంది. అయితే చిత్తూరులోనే రెండు జిల్లాలకు చెందిన ఈడీ కార్యాలయం ఉండడంతో అక్కడికి ప్రతిసారి వెళ్లలేకపోతున్నాం. తిరుపతి జిల్లాకు ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రత్యేక ఈడీని నియమించాలి.

– అజయ్‌కుమార్, ఎస్సీ నేత తిరుపతి

బీసీ కార్పొరేషన్ ఈడీని నియమించాలి



బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి తిరుపతి జిల్లాకు ప్రత్యేకంగా ఈడీని నియమించాలి. ఈడీ కార్యాలయం రెండు జిల్లాలకు చిత్తూరులో ఉండడంతో పలువురికి అన్యాయం జరుగుతోంది. జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తయి 3 ఏళ్లు గడుస్తున్నా బీసీ కార్పొరేషన్ తిరుపతికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయకపోవడం సరికాదు.

– కట్టా గోపి యాదవ్, బీసీ నేత తిరుపతి

వృథాగా విభిన్న ప్రతిభావంతుల కార్యాలయం



విభిన్న ప్రతిభావంతులు జిల్లాలో ఎందరో ఉన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక చాంబర్ ఉన్నప్పటికీ చిత్తూరులోనే ప్రధాన కార్యాలయం ఉందని చెబుతున్నారు. విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యాలయాన్ని తిరుపతికి మార్పు చేయాలి. – దుద్దు వేణు, ఎస్సీ సెల్ నేత, సత్యవేడు

మార్కెట్‌లోకి ఎంజీ విండ్సర్ ఈవీ ప్రో కారు



ఎంజీ విండ్సర్ ఈవీ ప్రో కారును ఆవిష్కరిస్తున్న ఎంజీ కంపెనీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: కెశ్విన్ ఆటో మోటార్స్ షోరూం వారి ఆధ్వర్యంలో గురువారం ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంజీ కంపెనీ వారి సరికొత్త విండ్సర్ ఎలక్ట్రికల్ ప్రో కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఎంజీ సౌత్ ఇండియా జోనల్ సేల్స్ మేనేజర్ సౌరవ్ ప్రకాష్, ఏఎస్ఎం అన్ని విల్సన్, కెశ్విన్ ఆటో మోటార్స్ అధినేత ఉదయ్‌కుమార్‌రెడ్డి ఎంజీ విండర్ ఈవీ ప్రో కారు ఆవిష్కరించి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంజీ విండర్ ఈవీ వాహనం 52.9 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ సౌలభ్యం కలిగి ఒకసారి చార్జింగ్ చేస్తే 449 కిలోమీటర్లు ప్రయాణం చేసే సౌకర్యం ఉందన్నారు. రాయలసీమలోని తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం , నెల్లూరు జిల్లాల్లో తమ షోరూముల్లో విండ్సర్ ఈవీ ప్రో కారు లభిస్తుదన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

తిరుపతి క్రైమ్ : జాతర రోజు అర్ధరాత్రి ఓ యువకుడిపై కొందరు వ్యక్తులు పాత కక్షలతో దాడి చేసిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నగరంలో నివాసం ఉంటున్న చందు (22) 13వ తేదీ జాతరలోని అన్నదానంలో పాల్గొని రాత్రి ఇంటికి వెళ్లే సమయంలో సంకల్ప హాస్పిటల్ వద్ద కొంత మంది గొడవ పడుతుండగా చూస్తూ నిలబడ్డాడు. ఈ క్రమంలో చందు ప్రత్యర్థి సురేష్ అనే వ్యక్తి చందును గమనించాడు. సురేష్ కత్తి ఇచ్చి చందుపై దాడి చేయమని చెప్పాడు. గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో పొడవగా తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం వారు అక్కడి నుంచి పారిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని యువకుడిని ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధిని ప్రాథమిక హక్కుగా ఉద్యమించండి



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

- 20 కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ?
- మోదీని సాగనంపేందుకు యువత నడుం బిగించాలి
- సీపీఐ జాతీయ నేత డి.రాజా పిలుపు

తిరుపతి కల్చరల్: రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు ధారాదత్తం చేస్తున్న నరేంద్రమోదీని సాగనంపేందుకు యువత, విద్యార్థులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభలు గురువారం సాయంత్రం తిరుపతి ఇందిరామైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా డి.రాజా పాల్గొని ప్రసంగించారు. మోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, ఈ హామీని అమలుచేసి ఉంటే 20 కోట్ల ఉద్యోగాలు దేశంలో ఇచ్చి ఉండాలని, అధికారంలోకి రాగానే హామీని తుంగలో తొక్కి నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉపాధి హక్కును ప్రాథమిక హక్కుగా చేర్చాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలను అలవంబిస్తున్న మోదీని సాగనంపేందుకు యువత నడు బిగించాలని కోరారు. సేవ్ ప్రభుత్వంరంగ స్థలను మోదీ, ఆదానీ, అంబానీలాంటి కార్పొరేట్‌లకు ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రవేటు రంగంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థగా నడవాలని, రాజకీయాలకు అతీతంగా ఉండాలని స్పష్టం చేశారు. నాడు ఇంద్రగుప్త అధ్యక్షతన నియమించిన కమిటీ ఎన్నికల సంస్కరణలను సిఫార్సుచేసిందని అయితే ఆ కమిటీ సిఫార్సులను పాలకులు తుంగలో తొక్కారన్నారు. భారత్ పాక్ మధ్య చెలరేగుతున్న వివాదంలో జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని నిరంతర సంక్షోభాన్ని సృష్టించారని పేర్కొన్నారు. మతాల మధ్య ఘర్షణలు సృష్టించి, మతోన్మాద ఉద్వేషాన్ని రెచ్చగొడుతూ లబ్ధి పొందాలని బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు.

అయ్యా.. మాబిడ్డను సౌదీ నుంచి రప్పించండి

– తహసీల్దార్‌కు ఓ తండ్రి విన్నపం



తహసీల్దార్‌కు విన్నవించుకుంటున్న తండ్రి కాలేషా (ఇన్‌సెట్) సౌదీ అరేబియాలో ఉన్న బాధితుడు నజీర్

కలువాయి(సైదాపురం):అయ్యా.. మా బిడ్డను సౌదీ నుంచి రప్పించి కాపాడాలని కలువాయి తహసీల్దార్ శ్యాంసుందర్‌కు మండలంలోని కుల్లూరు గ్రామానికి చెందిన షేక్ కాలేషా, బీబీ దంపతులు వేడుకున్నారు. వివరాలు ఇలా.. కలువాయి మండలంలోని కుల్లూరు గ్రామానికి చెందిన షేక్ కాలేషా, బీబీలకు షేక్ నజీర్ అనే కుమారుడున్నారు. అతను 7వ తరగతి వరకు చదువుకున్నాడు. 2024 డిసెంబర్ నెలలో ఓ ఏజెంటు మాటలు విని రూ.2 లక్షలు పెట్టి కుమారుడు నజీర్‌ను సౌదీ అరేబియా దేశానికి పంపారు. అక్కడ యజమాని పెట్టే చిత్ర హింసలు భరించలేకపోవడంతో ఫోన్ ద్వారా తమకు జరుగుతున్న సంఘటనపై చెప్పుకునే వాడన్నారు. దీంతో తమ బిడ్డను ఎలాగైనా ఇండియాకు రప్పించి ఆదుకోవాలని కన్నీరుమున్నీరయ్యారు.

విదేశీ యూనివర్సిటీతో ఎంబీయూ ఒప్పందం

– అమెరికా యూనివర్సిటీతో ఎంఓయూ



పెన్ స్టేట్ యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ డేవిడ్ ఎం కాల్లెజోతో ఎంబీయూ చాన్సలర్ మోహన్‌బాబు, మంచు విష్ణు

చంద్రగిరి : దేశంలోనే మొట్ట మొదటి సారిగా విద్యార్థుల సౌలభ్యం కోసం విదేశాలకు చెందిన ప్రముఖ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నట్లు ఎంబీయూ ప్రో చాన్సలర్ మంచు విష్ణు తెలిపారు. గురువారం ఎంబీ యూనివర్శిటీలోని దాసరి ఆడిటోరియం ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచింది. ఈ మేరకు అమెరికాకు చెందిన పెన్ స్టేట్ విశ్వవిద్యాలయం చాన్సలర్ డాక్టర్ డేవిడ్ ఎం కాల్లెజో, వీసీ డాక్టర్ వాహిద్ మోటీపల్లిలతో ఎంబీయూ చాన్సలర్ డాక్టర్ మంచు మోహన్ బాబు ఎంఓఏ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రో చాన్సలర్ మంచు విష్ణు అమెరికాకు చెందిన యూనివర్సిటీ చాన్సలర్, వీసీలతో కలసి ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటి ప్రైవేటు విశ్వవిద్యాలయం అమెరికాకు చెందిన విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం చేసుకోవడం చారిత్రకమన్నారు. ఇదొక నూతన ఆవిష్కరణకు నాంది పలుకుతుందని, విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. అమెరికాకు చెందిన యూనివర్సిటీతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా పలు కోర్సులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన తెలిపారు. కోర్సును బట్టి ఏడాది నుంచి నాలుగేళ్ల వరకు ఇక్కడ విద్యనభ్యసించి, మిగిలిన విద్యను అమెరికాకు చెందిన పెన్ స్టేట్ యూనివర్సిటీలో చదువుకునేలా ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. రెండు దేశాల్లోని యూనివర్సిటీల్లో ఒకటే సిలబస్ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, ఉత్తమ విద్యను అభ్యసించే వారికి స్కాలర్‌షిప్‌లను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, ప్రొ వోస్ట్ నాగరాజ రామారావ్, వీసీ కరుణాకరన్ ఇతర అధికారులు, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

తిరుపతి క్రైమ్ : సుందరయ్య నగర్‌లో ఉంటున్న ఓ బాలిక అదృశ్యమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 16 సంవత్సరాల బాలిక బుధవారం 10వ తరగతి టీసీ తీసుకొని వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన అమ్మాయి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సైనికులకు సంఘీభావం



తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఫ్లాగ్ మార్చ్

తిరుపతి, అన్నమయ్య సర్కిల్ : తిరుపతి రైల్వేస్టేషన్‌లో గురువారం రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్), ప్రభుత్వ రైల్వేపోలీసు (జీఆర్‌పీ), ఇతర అధికారులు, రైల్వే మిత్ర బృందంతో కలసి సైనికులకు సంఘీభావంగా జాతీయ జెండాతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సందీప్‌కుమార్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆశీర్వాదం, జీఆర్‌పీ ఎస్ఐలు రాంబాబు, రామకృష్ణ, రత్నమాల, స్టేషన్ మాస్టర్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, ఇతర అధికార సిబ్బంది పాల్గొన్నారు.


బాలికపై హత్యాచార ఘటనలో నిందితుడు అరెస్టు



పోక్సో కేసు వివరాలను మీడియాకు వివరిస్తున్న డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి : బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఆపై బాలికను హత మార్చిన నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు గురువారం చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజేష్‌నాయక్ తన భార్య, ఆరేళ్ల పాపతో కలసి మండల పరిధిలోని ఎం.కొంగరవారిపల్లి వద్ద ఉన్న ఓ ఇటుక బట్టీ వద్ద దినసరి కూలీగా పనిచేస్తుండగా, సమీప గ్రామానికి చెందిన నిందితుడు బాల కిషోర్ అక్కడే కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గత ఏడాది జనవరి 3వ తేదిన బాలిక కనిపించకపోవడంతో రాజేష్ నాయక్ చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరుసటి రోజు బాలిక శవమై కనిపించడంతో పోస్టుమార్టం నిర్వహించారు. బాలికపై లైంగిక దాడి చేసి ఆపై హత్య చేసినట్లుగా రిపోర్టు రావడంతో పోలీసులు పోక్సో కేసుగా మార్చారు. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న నిందితుడు బాల కిషోర్ పోలీసుల కళ్లు కప్పి పారిపోవడంతో అతడి కోసం పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో సీఐ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిందితుడిని తిరుపతిలో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణలో బాలికకు తినుబండారాల ఆశ చూపి, ఇటుక బట్టీ నుంచి కిడ్నాప్ చేసి అటవీ ప్రాంతంలో అత్యాచారానికి పాల్పడినట్లు నిందితుడు తెలిపారన్నారు. ఈ మేరకు నిందితుడి వాంగ్మూలం రికార్డు చేసి, రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించినందుకు చురుగ్గా వ్యవహరించిన సిబ్బందికి ఎస్పీ ఆదేశాల మేరకు నగదు ప్రోత్సాహ బహుమతిని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనితతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో తరగతుల నిర్వహణపై ఫిర్యాదు



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నేతలు

తిరుపతి అర్బన్ : ఇంటర్ విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చినా జిల్లాలోని సగం ప్రైవేటు కళాశాలలు తరగతులు నిర్వహిస్తున్నారని అధికారులు చర్యలు తీసుకోవడం లేదని భారత విద్యార్థి ఫెడరేషన్ నేతలు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో గురువారం విద్యార్థి సంఘం నేతలు జేసీని కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రైవేటు కళాశాలలు నిర్వహిస్తున్న వేసవి తరగతులతో పాటు వసతులు లేని కళాశాలల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు భగత్ రవి, వినోద్, తేజ, శివ పాల్గొన్నారు.

విష్ణు నివాసంలో చోరీ

తిరుపతి క్రైమ్ : తిరుమల దర్శనానికి వచ్చిన భక్తుల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడుకు చెందిన విజయ్ భాస్కర్ తమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం వచ్చారు. ఈ క్రమంలో గురువారం విష్ణు నివాసానికి చేరుకుని సేద తీరుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు అతని బ్యాగులోని వస్తువులను దొంగతనానికి పాల్పడ్డారు. ఇందులో భాగంగా 32 గ్రాములు విలువ చేసే నల్లపూసల దండ, రూ.1,20,000 నగదు, 40 వేల రూపాయలు విలువచేసే మొబైల్ ఫోను చోరీకి పాల్పడినట్లుగా ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.